ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5



తమిళనాడు
TAMILNADU
మంగళవారం 13 ఫిబ్రవరి 2024

ప్రభుత్వ ప్రసంగాన్ని బహిష్కరించిన గవర్నర్

- శాసనసభ చరిత్రలో ఇదే మొదటిసారి
- 4 నిమిషాల్లో మాట్లాడి కూర్చున్న గవర్నర్ రవి



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్ రవి.. పక్కనే స్పీకర్ అప్పావు

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలోనే తొలిసారిగా గవర్నర్ ప్రభుత్వ ప్రసంగాన్ని బహిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో రూపొందిన ప్రసంగ పాఠాన్ని పూర్తిగా చదవకుండా కేవలం నాలుగు నిమిషాల్లో క్లుప్తంగా ముగించారు. అంతేకాకుండా ఆ ప్రసంగంలోని పలు పేరాల్లోని సమాచారంతో తాను పూర్తిగా విభేదిస్తున్నట్లు ప్రకటించి మరీ సభలో కూర్చుండిపోయారు. దీంతో ముఖ్యమంత్రి స్టాలిన్ సహా మంత్రులు, శాసనసభ్యులు దిగ్భ్రాంతికి గురి కాగా.. స్పీకర్ అప్పావు పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. వెంటనే గవర్నర్ ప్రసంగం తమిళ అనువాదాన్ని చదివారు. శాసనసభ చరిత్రలో ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని గవర్నర్ పఠించకపోవడం ఇదే తొలిసారి. గతేడాది ఇదేరీతిలో గవర్నర్ ప్రసంగ పాఠంలో పలు చోట్ల మార్పులు, కూర్పులు చేసి తన ఇష్టానుసారం చదివిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత 17వ సభా నిబంధన కింద ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని యధాతథంగా సభ ఆమోదించింది. ఇదే తరహాలో, అదే సెక్షన్ ప్రకారం ఇప్పుడు ప్రభుత్వ ప్రసంగం పాఠాన్ని యథాతథంగా ఆమోదించేలా సీనియర్ మంత్రి దురైమురుగన్ తీర్మానం చేయగా, సభ్యుల మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. తొలుత సభ ప్రారంభం కాగానే గవర్నర్ రవి 'గౌరవనీయులైన స్పీకర్ గారికి, గౌరవనీయులు ముఖ్యమంత్రిగారికి, గౌరవప్రదమైన శాసనసభ్యులు, శాసనసభ సిబ్బంది, స్నేహితులు, తమిళ సోదరసోదరీ మణులారా! అందరికీ నమస్కారం' అంటూ తమిళంలో ప్రసంగించారు. అనంతరం ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'శాసనసభ సమావేశాల ప్రారంభ ప్రసంగం చేయడం అత్యంత గౌరవప్రదంగా భావిస్తున్నా. అందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ కొత్త సంవత్సరం అందరికీ ఆనందాన్ని పంచాలని ఆశిస్తున్నా. రాష్ట్రాభివృద్ధికి సంబంధించి రాష్ట్రప్రభుత్వ ఆశయాలను తెలిపే ఈ ప్రసంగాన్ని తిరువళ్లువర్ సూక్తితో ప్రారంభిస్తున్నా' అంటూ ఆ సూక్తిని తమిళంలో వినిపించారు. ప్రజలకు వ్యాధులు లేని జీవితం, సమృద్ధిగా పంటలు, ఆర్థిక శ్రేయస్సు, సంతోషం, సరైన భద్రత అనే ఐదు అంశాలను కల్పించడమే సుపరిపాలన బాధ్యత అని ఆ సూక్తికి అర్థాన్ని వివరించారు. ఆ తర్వాత అనూహ్యంగా గవర్నర్ స్వరం మార్చారు. తన ప్రసంగానికి ముందు, ముగిసిన తర్వాత జాతీయగీతం వినిపించాలని తాను చేసిన సూచన, సలహాను స్పీకర్ పట్టించుకోకపోవడం గర్హనీయమన్నారు. ప్రభుత్వ ప్రసంగ పాఠంలో పలు పేరాలు ఉన్నాయని, అవన్నీ వాస్తవాలకు, ధార్మిక అంశాలకు దూరంగా ఉండటంతో విభేదిస్తూ తన ప్రసంగాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించారు. తుదిగా 'తమిళనాడు వర్ధిల్లాలి, భారతదేశం వర్ధిల్లాలి, జైహింద్, జై భారత్, ధన్యవాదాలు' అంటూ గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించి, స్పీకర్ పోడియం వద్ద తనకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కుర్చీలో ఆసీనులయ్యారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. అసలేం జరిగిందే అర్థంగాక సభ్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. పరిస్థితిని గ్రహించిన స్పీకర్ అప్పావు.. వెంటనే కార్యాచరణకు దిగారు. గవర్నర్ ఆంగ్ల ప్రసంగం తమిళ అనువాదాన్ని పఠించారు. స్పీకర్ ప్రసంగ పాఠాన్ని ముగించేంతవరకు గవర్నర్ తన సీటులోనే కూర్చుండిపోయారు. గవర్నర్ ప్రసంగం తమిళ అనువాదాన్ని చదివాక స్పీకర్ అప్పావు.. గవర్నర్‌ను విమర్శిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. అనంతరం సభలో జాతీయ గీతం ఆలపించాలని ఆదేశించారు. ఈలోపే స్పీకర్ తన గురించి విమర్శించిన విషయాన్ని తన వ్యక్తిగత అధికారుల ద్వారా తెలుసుకున్న గవర్నర్ ఆగ్రహంతో లేచి విసవిసా నడుచుకుంటూ సభ నుంచి నిష్క్రమించారు.

రికార్డుల నుంచి తొలగింపు...

శాసనసభలో ప్రభుత్వ ప్రసంగంపై గవర్నర్ రవి చేసిన విమర్శలు, వ్యాఖ్యలు.. ఆ తరువాత స్పీకర్ అప్పావు గవర్నర్‌పై చేసిన విమర్శలు సభ రికార్డుల నుంచి తొలగిస్తూ సీనియర్ మంత్రి దురైమురుగన్ ఓ తీర్మానం ప్రవేశపెట్టారు. సభా నిబంధన 17ఎ సెక్షన్ ప్రకారం సభకు సమర్పించిన గవర్నర్ ప్రసంగం యథాతథంగా చదివినట్లే భావించి ప్రసంగ పాఠం సభ రికార్డుల్లో యథాతథంగా నమోదు చేయాలని ఆయన తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆ తీర్మానం మూజువాణి ఓటుతో సభామోదం పొందినట్లు స్పీకర్ అప్పావు ప్రకటించారు.

మార్పులు, చేర్పులు చెప్పకుండానే

ఎలా బహిష్కరిస్తారు?

- గవర్నర్‌ను నిలదీసిన న్యాయశాఖ మంత్రి



న్యాయశాఖ మంత్రి మూర్తి

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందించిన ప్రసంగ పాఠంలో మార్పులు, చేర్పులు చేయాలని చెప్పకుండానే గవర్నర్ ప్రసంగ పాఠాన్ని బహిష్కరించడం గర్హనీయమని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి మూర్తి అన్నారు. సోమవారం ఉదయం శాసనసభ సమావేశం ముగియగానే సచివాలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ... దక్షిణాది రాష్ట్రాల గవర్నర్లు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యవహరించడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నారని, ఈ విషయంలో రాష్ట్ర గవర్నర్ అతీతుడు కాదన్నారు. ప్రభుత్వ విజయాల గురించి ప్రస్తావించేందుకు గవర్నర్‌కు మనసొప్పలేదన్నారు. కొన్ని రంగాల్లో రాష్ట్రం ముందంజలో ఉందంటూ ప్రసంగ పాఠంలో పలు చోట్ల ప్రస్తావించడాన్ని గవర్నర్ సహించలేకపోయారని, అందుకే ప్రసంగ పాఠాన్ని బహిష్కరించారన్నారు. శాసనసభ నియమ నిబంధనల మేరకు గవర్నర్ ప్రసంగం చివర మాత్రమే జాతీయ గీతం వినిపించడం ఆనవాయితీ అని, గవర్నర్ చెప్పినట్లు ప్రసంగానికి ముందు జాతీయ గీతం వినిపించిన సందర్భాలు లేవన్నారు. ముందుగా తమిళతల్లి ప్రార్థనను వినిపిస్తారని గుర్తు చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన తేనీటి విందులో రాష్ట్ర మంత్రులు పాల్గొన్న తర్వాత ప్రభుత్వానికి- గవర్నర్‌కు మధ్య సయోధ్య ఏర్పడుతుందని భావించామని, అయితే మళ్లీ అభిప్రాయభేదాలు అధికమవుతున్నాయన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో గవర్నర్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగాయంటూ ప్రధాన ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి పేర్కొనడంపై మంత్రి బదులిస్తూ... పదేళ్లపాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వారంతా గులాములుగా వ్యవహరించారని, కనుకనే గవర్నర్లంతా ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని ఫుల్‌స్టాప్, కామాలు కూడా మార్చకుండా చదివారన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ ప్రసంగ పాఠాల్లో పలు చోట్ల అమ్మ... అమ్మా... అంటూ మాజీ ముఖ్యమంత్రి జయలలితను సంబోధించే పదాలు కోకొల్లలుగా ఉండేవని, వాటిని గవర్నర్లు మార్చకుండా పలికారన్నారు. డీఎంకే ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగ పాఠంలో వివిధ శాఖలలో ప్రభుత్వం ముందంజలో ఉన్నట్లు పలు చోట్ల పేర్కొన్నామని, పదే పదే రాష్ట్రం ముందంజలో ఉందనే పదాలను చూసి గవర్నర్ ప్రసంగం చేయలేదేమోననే అనుమానం కలుగుతోందన్నారు. గవర్నర్, ముఖ్యమంత్రి కలుసుకుని రాజీ కుదుర్చుకోవాలని సుప్రీంకోర్టు చేసిన సలహా ఆచరణకు నోచుకోలేకపోయిందన్నారు. సోమవారం శాసనసభలో గవర్నర్ వ్యవహరించిన తీరును చూసి సుప్రీంకోర్టు తగు నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నామన్నారు. ఈ సంఘటనలను తమ తరఫు న్యాయవాదులు న్యాయస్థానంలో తప్పకుండా ప్రస్తావిస్తారని చెప్పారు. గవర్నర్ ప్రసంగ పాఠాన్ని యథాతథంగా సభ ఆమోదించేలా సభా నిబంధన 17 సెక్షన్‌ను సడలించినప్పుడు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సభ్యులు మునుపటిలా వాకౌట్ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

తెలంగాణ బాట వద్దన్నారు...

ప్రభుత్వంపై గవర్నర్ ఎన్ని విమర్శలు చేసినా సీఎం స్టాలిన్ హుందాగా వ్యవహరిస్తున్నారని, గవర్నర్‌కు గౌరవ మర్యాదలకు లోటు రానీయకుండా మసలుకుంటున్నారని మంత్రి మూర్తి అన్నారు. గతేడాది గవర్నర్ అసెంబ్లీలో వ్యవహరించిన తీరుతో తామంతా ఆయన్ని దూరంగా పెడదామని, తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగం లేకుండా సభలు జరిపినట్లు, గవర్నర్‌ను ఆహ్వానించవద్దని చెప్పినా సీఎం అంగీకరించలేదన్నారు.

అసత్యాలు, అవాస్తవాలు...

ప్రసంగ పాఠంలో మార్పులు చేర్పుల గురించి తెలుపకుండానే ఆ ప్రసంగంలో అసత్యాలు, అవాస్తవాలు ఉన్నాయని గవర్నర్ పేర్కొనడం సమంజసంగా లేదన్నారు. గవర్నర్ ప్రసంగం పాఠంలోని అంశాలు తన మనస్సాక్షికి విరుద్ధంగా ఉన్నట్లు భావిస్తే సభకు రాకుండా ఉంటే బాగుండేదన్నారు. గవర్నర్ వ్యవహారశైలి 'ఇండియా కూటమి'కి బలం చేకూర్చేలా ఉందని మంత్రి మూర్తి అన్నారు.

సభామర్యాదల్ని మంటగలిపారు

- స్పీకర్‌పై గవర్నర్ ఆగ్రహం
- రాజ్‌భవన్ నుంచి ప్రకటన విడుదల



చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో స్పీకర్ అప్పావు సభా మర్యాదల్ని మంటగలిపారని, తనపై విమర్శలు చేసి ఆయన పదవికున్న గౌరవాన్ని కించపరచుకున్నారని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం శాసనసభలో ప్రసంగించేందుకు వెళ్ళినప్పుడు జరిగిన ఘటనలను వరుసగా వివరించారు. ఈ మేరకు రాజ్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలోని అంశాలు :

1. గవర్నర్ ప్రసంగ పాఠం ఈనెల 9న రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందింది. ఆ ప్రసంగ పాఠంలో పలు పేరాల్లోని అంశాలు అవాస్తవాలు. తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయి.

2. గవర్నర్ కొన్ని ఈ దిగువ సూచనలు చేయమంటూ ప్రసంగ పాఠాన్ని తిప్పి పంపారు.

(ఎ) జాతీయ గీతాన్ని గౌరవించేలా గవర్నర్ ప్రసంగాన్ని చదవడానికి ముందు, వెనుక తప్పకుండా జాతీయ గీతాన్ని వినిపించాలి. ఈ విషయం గురించి ఇంతకు మునుపు పలుమార్లు ముఖ్యమంత్రి, స్పీకర్‌కు లేఖలు కూడా రాశాను.

(బి) గవర్నర్ ప్రసంగం ప్రభుత్వ సాధించిన లక్ష్యాలను తెలిపే విధంగా, కొత్త విధానాలు, పథకాలను ప్రకటించే రీతిలో, శాసనసభ సమావేశం ఎందుకు సమావేశమవుతోందన్న కారణాలను వివరించేలా ఉండాలి. తప్పుదోవపట్టించే విధంగా రాజకీయ అభిప్రాయాలను వెదజల్లడానికి వేదికగా ఉండకూడదు.

3. గవర్నర్ సలహాలు, సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు.

4. సోమవారం ఉదయం చేసిన ప్రసంగంలో స్పీకర్‌కు, ముఖ్యమంత్రికి, శాసనసభ్యులకు, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసి ప్రసంగ పాఠంలో తిరుక్కురళ్ సూక్తి కలిగిన తొలి పేరాను మాత్రమే చదివారు. ఆ తర్వాత గవర్నర్ రాజ్యాంగపరమైన హక్కులను పరిగణనలోకి తీసుకుని ప్రసంగ పాఠాన్ని పఠించేందుకు నిరాకరించారు. ఎందుకంటే ఆ ప్రసంగంలో ప్రజల్ని తప్పుదారి పట్టించే అవాస్తవాలు చాలా ఉన్నాయి. వాటిని చదివితే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్లవుతుంది. కనుకనే సభ పట్ల తనకున్న గౌరవభావాలను తెలియజేసి రాష్ట్ర ప్రజలకు మేలు జరిగేలా సభ ఫలవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ తన క్లుప్త ప్రసంగాన్ని ముగించారు.

5, ఆటుపిమ్మట స్పీకర్ గవర్నర్ ప్రసంగ పాఠం తమిళ అనువాదాన్ని పఠించేంతవరకూ గవర్నర్ సభలోనే ఆసీనులయ్యారు.

6. స్పీకర్ ప్రసంగ పాఠం ముగిసిన వెంటనే సభ షెడ్యూలు ప్రకారం జాతీయ గీతం వినిపిస్తారనుకుని గవర్నర్ లేచారు. అయితే స్పీకర్ షెడ్యూలును పాటించడానికి బదులుగా గవర్నర్‌పై విరుచుకుపడ్డారు. గవర్నర్‌ను గాడ్సే అనుచరుడని పేర్కొన్నారు. స్పీకర్ తన అనాలోచిత ప్రవర్తన ద్వారా సభ మర్యాదను, తన పదవికున్న గౌరవాన్ని మంటగలిపారు. స్పీకర్ అదే పనిగా గవర్నర్‌పై విమర్శలు కొనసాగించడంతో గవర్నర్ సభా గౌరవాన్ని పాటిస్తూ, హుందాగా అక్కడి నుంచి నిష్క్రమించారు.

22 వరకు అసెంబ్లీ సమావేశాలు



అడయార్, ఫిబ్రవరి 12: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతాయని స్పీకర్ ప్రకటించారు. ఈ మేరకు సభాపతి అప్పావు సారథ్యంలో జరిగిన శాసనసభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) నిర్ణయించింది. గవర్నర్ ప్రసంగం తంతు ముగిశాక బీఏసీ సమావేశం జరిగింది. ఇందులో ఈ బడ్జెట్ సమావేశాలను వారం రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. అంటే మంగళవారం నుంచి మూడు రోజుల పాటు సభ జరుగుతుంది. ఆ తర్వాత 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సభను నిర్వహించాలని తీర్మానించారు. మంగళవారం జరిగే సమావేశాల్లో ఆర్బీఐ మాజీ గవర్నర్ వెంకట్రామన్, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు బద్రీనాథ్, మాజీ గవర్నర్ ఫాతిమా బీవీ, డీఎండీకే అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయకాంత్ సహా ఇటీవల మృతిచెందిన మాజీ ఎమ్మెల్యేల మృతికి సభలో సంతాపం తెలపనున్నారు. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభమవుతుంది. 14, 15 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగుతుంది. 16 నుంచి 18వ తేదీ వరకు సెలవులు కాగా, 19వ తేదీన బడ్జెట్, 20వ తేదీన వ్యవసాయ బడ్జెట్ దాఖలు చేయనున్నారు. అనంతరం 21, 22 తేదీల్లో బడ్జెట్ పద్దులపై చర్చ జరగనుంది.

పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయం

- ప్రభుత్వం స్పష్టీకరణ
- మెట్రో రైల్ రెండో దశకు అనుమతివ్వాలని కేంద్రానికి డిమాండ్
- గవర్నర్ ప్రసంగంలో వెల్లడి
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం దేశంలో అమలు చేయతలపెట్టిన ఉమ్మడి పౌరసత్వ సవరణ చట్టాన్ని తమిళనాడులో అమలు చేయబోమని రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం ప్రారంభమైన రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల గవర్నర్ ప్రసంగంలో పేర్కొంది. అదేసమయంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతించి, నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం రూపొందించిన ప్రసంగ పాఠాన్ని గవర్నర్ రవి బహిష్కరించగా, ఆ ప్రసంగ తమిళ అనువాదాన్ని స్పీకర్ అప్పావు చదివి వినిపించారు. అందులోని ముఖ్యాంశాలను పరిశీలిస్తే...

దేశ ఆర్థిక వ్యవస్థలో అధిక భాగస్వామ్యం...

గత పదేళ్లుగా దేశ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం కీలక భూమికను పోషిస్తోంది. దేశ విస్తీర్ణంలో నాలుగో వంతు, జనాభా నిష్పత్తిలో ఆరో శాతం ఉన్న రాష్ట్రం.. దేశ ఆర్థికాభివృద్ధిలో 9 శాతం భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. 2022-23లో 7.24 శాతంగా ఉన్న రాష్ట్ర ఆర్థికాభివృద్ధి ప్రస్తుతం 8.19 శాతానికి చేరుకుంది. 2022-23 సంవత్సరంలో దేశ ద్రవ్యోల్బణం 6.65 శాతంగా ఉంటే రాష్ట్రంలో ద్రవ్యోల్బణం శాతం 5.97 శాతంగా ఉంది. దేశ అభివృద్ధితో పోల్చితే రాష్ట్రాభివృద్ధి శరవేగంగా సాగుతోంది. ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్ర ఆర్థిక రంగం సరైన బాటలోనే పయనిస్తోంది.

మెట్రో రైల్ రెండో దశకు అనుమతివ్వాలి..

మెట్రో రైల్ రెండో దశ నిర్మాణ పనులకు హామీ ఇచ్చినట్టుగా కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించలేదు. కేంద్రప్రభుత్వ అనుమతి లేకపోవడంతో ఈ రెండో దశ మెట్రో రైల్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రజలతో ముఖ్యమంత్రి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 2.40 లక్షల వినతులకు పరిష్కారం లభించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు భేషుగ్గా ఉండటంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయి. తుపాను వరద సాయం నిధులను కూడా కేంద్రం ఇవ్వలేదు. రాష్ట్రంలో ధరల స్థిరీకరణ కోసం నిత్యావసర ధరలు పెరగకుండా నియంత్రణలో ఉంచాం. జీఎస్టీ విధానం వల్ల రాష్ట్ర ఆదాయంలో గండిపడింది. ఇప్పటివరకు రూ.24,936 కోట్ల మేరకు స్వయం సహాయక బృందాలకు రుణాలు మంజూరయ్యాయి.

పౌరసత్వ సవరణ చట్టాన్ని అనుమతించం...

కేంద్రప్రభుత్వం అమలుచేయతలపెట్టిన ఉమ్మడి పౌరసత్వ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోం. ఈ అంశంలో ప్రభుత్వం ఒక దృఢమైన సంకల్పంతో ఉంది. కేంద్రప్రభుత్వం వచ్చే జనభా లెక్కలను కులాల వారీగా చేపట్టాలి. ముఖ్యమంత్రి కలల ప్రాజెక్టు అయిన అల్పాహార పథకంలో పాఠశాలల్లో విద్యార్థుల హాజరుతో పాటు విద్యార్థుల విద్యాపఠనం కూడా పెరిగింది. దేశానికే మార్గదర్శకంగా ఉన్న ఈ అల్పాహార పథకాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేసున్నాం. ఈ పథకం కింద 16.85 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు.

సీఎం గ్రామీణ రోడ్ల విస్తరణ పథకం...

ముఖ్యమంత్రి గ్రామీణ రహదారుల విస్తరణ పథకాన్ని ప్రవేశపెట్టి.. గ్రామీణ ప్రాంతాల్లో కూడా విశాలమైన రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ పథకం కింద 3059 కిలోమీటర్ల గ్రామీణ రహదారుల విస్తరణ రూ.4861, 187 వంతెనల నిర్మాణం రూ.553 కోట్లతో ఈ సంవత్సరంలో చేపట్టనున్నాం. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు నెలవారీ మెస్ బిల్లును రూ.1000 నుంచి రూ.1400 వరకు, కాలేజీ విద్యార్థులకు రూ.1100 నుంచి రూ.1500కు పెంచాం. దీని వల్ల 1.71 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటి వద్దకే వైద్యం, ఆలయాల పరిరక్షణ, వరద బాధితులకు రూ.6 వేల వరదసాయం వంటి అనేక సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోంది.

ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతిలో అగ్రస్థానం

ఎలక్ట్రానిక్ వస్తు ఉత్పత్తిలో రాష్ట్రం మొదటి స్థానానికి చేరుకుంది. 2021-22 మధ్య కాలంలో దేశంలో నాలుగో స్థానంలో ఉన్న రాష్ట్రం... 2022-23లో మొదటి స్థానానికి ఎగబాకింది. ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు ద్వారా 14.54 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించేలా గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.6.64 లక్షల కోట్లకు పెట్టుబడులను సాధించి సరికొత్త రికార్డును నెలకొల్పాం. ఈ సదస్సులో 631 అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నాం. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్థాయికి చేరుకునే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఉప్పూ కారంలేని ప్రసంగమది

● ఈపీఎస్ వ్యంగ్యాస్త్రాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈపీఎస్

అడయార్, ఫిబ్రవరి 12: శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభరోజైన సోమవారం స్పీకర్ అప్పావు చదివి వినిపించిన గవర్నర్ ప్రసంగం ఉప్పూకారం లేకుండా పాచిపోయిన చద్దన్నం మూటగా ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి కె.పళనిస్వామి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గవర్నర్ ప్రసంగం ముగిశాక ఆయన తన పార్టీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు... 'గత యేడాది తరహాలోనే ఈసారి కూడా గవర్నర్ ప్రసంగం ఉంది. ఇది ప్రభుత్వ విధి విధానాలను వెల్లడించే ప్రసంగంగా లేదు. రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేని ప్రసంగమిది. కొత్తగా ఎలాంటి పథకాలను ప్రభుత్వం వెల్లడించలేదు. గవర్నర్ రవి తన ప్రసంగాన్ని కేవలం నాలుగు నిమిషాల్లోనే ముగించారని మాట్లాడుతున్నారు. గవర్నర్ ముందుగానే స్పీకర్‌కు ఒక లేఖ రాశారు. అందులో సభ ప్రారంభానికి ముందు జాతీయ గీతాన్ని ఆలపించాలని కోరారు. దీన్ని స్పీకర్ పట్టించుకోలేదు. ఈ విషయంలో ప్రభుత్వానికి, గవర్నర్‌కు, స్పీకర్‌కు మధ్య ఎలాంటి విభేదాలు ఉన్నాయో వారినే అడిగి తెలుసుకోండి. స్పీకర్ అప్పావు సభా సంప్రదాయాల గురించి మాట్లాడుతున్నారు. ఆయన సభా మర్యాదలను పాటిస్తున్నారా అని అడుగుతున్నాం. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా అన్నాడీఎంకే ఉంది. విపక్ష నేతగా నేనున్నా. ఉప నేతగా మా పార్టీకి చెందిన ఉదయకుమార్‌ను ఏకగ్రీవంగా తీర్మానం చేసి స్పీకర్‌కు అందజేశాం. కానీ, ఇప్పటివరకు ఈ తీర్మానాన్ని ఆయన ఆమోదించలేదు. మా పార్టీ ఉప నేతకు సీటును కేటాయించలేదు. ప్రతిసారీ ఆయన ఏదో ఒక కారణం చెబుతున్నారు. కనీసం ఇప్పుడైనా సాకు చెప్పరని భావిస్తున్నా. శాసనసభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలి. కానీ, స్పీకర్ ఏకపక్షంగా నడుచుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల కోసం డీఎంకే రూపొందించిన మేనిఫెస్టోలో రాష్ట్రంలో తిరిగే అన్ని సిటీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. కానీ, కొన్ని బస్సులకు ముందు, వెనుక భాగంలో పింక్ కలర్ వేసి, ఆ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటూ ప్రజలను మోసం చేశారు. పైగా డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రూట్లలో బస్సులను నిలిపివేసింది' అని ఈపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సభా సంప్రదాయాలను పాటించరా?

● స్పీకర్‌పై బీజేపీ ఎమ్మెల్యేల ఆగ్రహం



విలేకరుల సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు

అడయార్, ఫిబ్రవరి 12: బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజైన సోమవారం గవర్నర్ రవిని ఉద్దేశించి స్పీకర్ అప్పావు చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ముక్తకంఠంతో ఖండించారు. ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగ పాఠాన్ని చదివేందుకు గవర్నర్ నిరాకరించగా, ఆ ప్రసంగ పాఠాన్ని స్పీకర్ అప్పావు చదవి సభ్యులకు వినిపించారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను ఉద్దేశించి స్పీకర్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. వీటిని బీజేపీ ఎమ్మెల్యేలు నయినార్ నాగేంద్రన్, వానతి శ్రీనివాసన్, సరస్వతి ఖండించారు. అసెంబ్లీ వెలుపల వారు విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర శాసనసభలో గవర్నర్ సభా సంప్రదాయాల మేరకే నడుచుకున్నారని తెలిపారు. సభ ప్రారంభమైన తర్వాత జాతీయ గీతాలాపన చేయాలని గవర్నర్ ముందుగానే ఒక లేఖ ద్వారా కోరగా, దాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అయినప్పటికీ గవర్నర్ సభలోనే కూర్చొని స్పీకర్ చదువుతున్న గవర్నర్ ప్రసంగాన్ని ఆలకించారన్నారు. తద్వారా గవర్నర్ ఏ కోణంలోనే సభా మర్యాదలను ఉల్లంఘించలేదన్నారు. ప్రభుత్వ ప్రసంగం పాఠం పూర్తిగా చదివిన తర్వాత స్పీకర్. గవర్నర్‌ను ఉద్దేశించి గాడ్సే, సావర్కర్ మార్గంలో వచ్చిన వ్యక్తి అంటూ వ్యాఖ్యానించారని, రాష్ట్ర శాసనసభ చరిత్రలో ఇలాంటి వ్యాఖ్యలు ఎన్నడూ వినలేదన్నారు. స్పీకర్ సభా సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కర్ణాటకలో ప్రబలుతున్న 'మంకీ ఫీవర్'

రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తం



పెరంబూర్, ఫిబ్రవరి 12: కర్ణాటక రాష్ట్రంలో 'మంకీ ఫీవర్' కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు జిల్లాలు అప్రమత్తమయ్యాయి. అక్కడ నివారణ చర్యలు ముమ్మరం చేయాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం అన్ని జిల్లాల ఆరోగ్యశాఖ అధికారులకు సర్క్యులర్ పంపారు. 'క్యాసనూర్ ఫారెస్ట్ డిసీజ్ వైరస్ (కేఎఫ్‌డీవీ) అనే మంకీ ఫీవర్‌తో కర్ణాటక రాష్ట్రంలో 53 మంది చికిత్స పొందుతుండగా, ఇద్దరు మృతిచెందారన్నారు. 1957లో గుర్తించిన ఈ వైరస్ కారణంగా ఏడాదికి 400 నుంచి 500 మందికి సోకుతోందని తెలిపారు. వానరాలు, పశువుల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తిస్తుండగా, వానరాల నుంచి వైరస్ వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. ఈ వైరస్ సోకిన వారికి జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, వాంతులు, జీర్ణకోశ సమస్యలు, రక్తపోటు తదితర లక్షణాలుంటాయని తెలిపారు. ఈ లక్షణాలు సోకిన వారు చికిత్స అనంతరం కోలుకుంటుండగా, కొందరికి మాత్రం ప్రమాదకరంగా మారే అవకాశముందన్నారు. పీసీఆర్, రక్తపరీక్షల ద్వారా ఈ జ్వరాన్ని నిర్ధారించవచ్చన్నారు. ఈ వైరస్ రాష్ట్రంలో ప్రబలకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి, ఆ రాష్ట్రాల నుంచి వచ్చే వారికి పరీక్షలు నిర్వహించాలని, జ్వరం, తలనొప్పి తదితర సమస్యలతో బాధపడే వారికి వైద్యపరీక్షలు చేసి తగిన చికిత్సలందించాలని సూచించారు. పశువులు, ఆవులు, ఎద్దులను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వాటిని మేత కోసం అడవుల్లోకి పంపకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధికారక సూక్ష్మజీవులను అంతమొందించేలా పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేయాలని ఆరోగ్యశాఖ జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది.

పోలీసులకు కవాతు శిక్షణ



కవాతు శిక్షణలో పోలీసులు

పెరంబూర్, ఫిబ్రవరి 12: కోయంబత్తూర్‌లో పోలీసు కవాతు శిక్షణ ఆదివారం జరిగింది. కోవై నగర సాయుధ దళ పోలీసులకు యేటా 'వార్షిక కవాతు శిక్షణ' అందిస్తుంటారు. ఆ ప్రకారం, నగర పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ ఉత్తర్వులతో, కోవై అవినాశి రోడ్డులోని పోలీసుల శిక్షణ పాఠశాల మైదానంలో జరిగిన శిక్షణకు నగర సాయుధ దళంలో పని చేస్తున్న మహిళలు, పురుషులు అని సుమారు 500 మంది పాల్గొన్నారు.

కీలంబాక్కం బస్ టెర్మినల్ పరిశీలనకు వస్తారా?

● ఈపీఎస్‌కు మంత్రి శివశంకర్ ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 12: కీలంబాక్కం బస్ టెర్మినల్‌లో మౌలిక వసతులు, ప్రయాణికులకు అన్ని వసతులు కల్పించామని, వీటిని పరిశీలించేందుకు ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి వస్తే, తాను, మంత్రి శేఖర్‌బాబు ఆయన వెంట ఉంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ చెప్పారు. నగరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కీలంబాక్కం బస్ టెర్మినల్‌లో వసతులు లేవని, బస్సులు సక్రమంగా లేవని, నగరం నుంచి అక్కడకు వెళ్లేందుకు ఎంటీసీ బస్సులు లేవంటూ వస్తున్న వార్తలు నిరాధారమైనవన్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి కోయంబేడు, ప్యారీస్ తదితర ప్రాంతాలకు ఎంటీసీ బస్సులు ఎలా నడుస్తున్నాయో, కీలంబాక్కం బస్ టెర్మినల్‌కు కూడా అధిక సంఖ్యలో సర్వీసులు నడుపుతున్నామన్నారు. అలాగే ప్రీ పెయిడ్ ఆటో సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా కొత్త బస్సుల కొనుగోలు స్తంభించిందన్నారు. ప్రస్తుతం 4,000 కొత్త బస్సుల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 3,000 బస్సులు మాత్రమే కొనుగోలు చేశారని, విమర్శ చేసే ముందు తమ ప్రభుత్వం ఏమి చేసిందో గుర్తుచేసుకోవాలని ఈపీఎస్‌కు మంత్రి శివశంకర్ సలహా ఇచ్చారు.

మధ్యాహ్న భోజనం తిని 50మంది విద్యార్థులకు అస్వస్థత

పెరంబూర్, ఫిబ్రవరి 12: కడలూరు జిల్లా చిదంబరం సమీపం సాక్కాంగుడిలో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన సుమారు 50 మంది విద్యార్థులు వాంతుల చేసుకుంటూ స్పృహతప్పి పడిపోయారు. ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని వెంటనే కడలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్న వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. బల్లి పడిన ఆహారం విద్యార్థులు తీసుకొని ఉండొచ్చని ప్రాథమిక అంచనా వేసిన అధికారులు, ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు.

ఇంట్లో చొరబడిన మొసలి



వక్కిరమారి నదిలో మొసలిని వదులుతున్న దృశ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 12: కడలూరు జిల్లా చిదంబరం సమీపం నంజలూరు గ్రామానికి చెందిన అబ్దుల్ రషీద్ ఇంట్లో సుమారు 8 అడుగుల పొడవు, 110 కిలోల బరువు ఉన్న మొసలి ప్రవేశించింది. ఆ మొసలిని చూసి భయభ్రాంతులైన రషీద్ కుటుంబీకులు ఇంటి వెనుక వైపు తలుపు ద్వారా బయటకు పరుగులు తీసి అటవీ శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. రేంజర్ ప్రభు, సిబ్బంది అక్కడికి చేరుకొని సుమారు గంట పాటు శ్రమించి మొసలిని బంధించి సమీపంలోని వక్కిరమారి నదిలో వదిలి పెట్టారు.

కొడైకెనాల్‌లో కార్చిచ్చు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో కార్చిచ్చు ఏర్పడినట్లు అటవీ శాఖ వెల్లడించింది. కొడైకెనాల్ అటవీ ప్రాంతాల్లో మార్చి నుంచి మే వరకు అప్పుడప్పుడూ వేసవి ప్రభావంతో కార్చిచ్చు ఏర్పడుతోంది. అయితే ఈ ఏడాది శీతోష్ణస్థితుల మార్పుల కారణంగా ఇప్పటినుంచే కార్చిచ్చు ఏర్పడడం ప్రారంభమైందని అధికారులు తెలిపారు. పళని వెళ్లే మార్గంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఆదివారం ఏర్పడిన కార్చిచ్చు ఆర్పేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

ఈడీ, ఐటీ, సీబీఐని నమ్ముకొని ఎన్నికల బరిలోకి

● బీజేపీపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ధ్వజం

పెరంబూర్, ఫిబ్రవరి 12: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ, ఐటీ శాఖ (ఐటీ)లను నమ్ముకొని బీజేపీ పార్లమెంటు ఎన్నికలను ఎదుర్కొంటోందని విరుదునగర్ కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ విమర్శించారు. విరుదునగర్ జిల్లా సిరుకుళం కన్యాయ్‌నగర్‌లో రూ.8.50 లక్షలతో ఏర్పాటుచేసి విద్యుత్ హై టవర్ సహా పలు అభివృద్ధి పనులను సోమవారం భూమి పూజ చేసిన ఎంపీ మాణిక్యం ఠాగూర్ విలేకరులతో మాట్లాడుతూ... ఈడీ, ఐటీ, సీబీఐలతో 'ఇండియా' కూటమిలోని పార్టీలను భయభ్రాంతులు చేసే చర్యలను బీజేపీ చేపట్టిందన్నారు. ఈ దాడులకు భయపడిన పలు పార్టీలు కూటమి నుంచి వైదొలిగిన నేపథ్యంలో, ధైర్యంగా ఎదుర్కొంటున్న పార్టీలతో ఇండియా కూటమి బలంగా ఉందన్నారు. మోదీ, అమిత్‌షా బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగం, నిత్యావసర ధరల పెంపు తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రామాలయం నిర్మాణానికి ముందు, ప్రారంభించిన తర్వాత చేపట్టిన సర్వేల్లో బీజేపీ అధిక స్థానాలు గెలుస్తుందని చెబుతున్నా... మైనార్టీలు, దళితులు, పేదలు ఇండియా కూటమిని ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నటుడు విజయ్ రాజకీయ పార్టీ ప్రారంభించడాన్ని ఆహ్వానిస్తున్నామని ఎంపీ పేర్కొన్నారు.

కార్పొరేషన్ కమిషనర్ల బదిలీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: రెండు కార్పొరేషన్ల కమిషనర్లు బదిలీ అయ్యారు. మదురై కార్పొరేషన్ కమిషనర్ మధుబాలన్ తూత్తుకుడి కార్పొరేషన్‌కు, తూత్తుకుడి కార్పొరేషన్ కమిషనర్ నిలీష్‌కుమార్ మదురై కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

సమాచార దర్శిని

రెండు రోజులు వర్షాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: దక్షిణ జిల్లాలు సహా డెల్టా ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో వర్షాలు కురిసే అవకాశమున్నట్లు చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. వారం రోజులుగా తమిళనాడు, పుదుచ్చేరిల్లో పొడి వాతావరణం నెలకొంది. కారైక్కాల్‌లో స్వల్పవర్షాలు, దక్షిణ జిల్లాలు, డెల్టా జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురవనున్నాయని, చెన్నైలో ఆకాశం మేఘావృతమై కనిపిస్తుందని, గరిష్ఠంగా 32 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. కన్నియాకుమారి ప్రాంతంలో 65 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఈ రెండ్రోజులు జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని సూచించింది.

1,200 చిన్న సంస్థలకు రూ.33 కోట్ల రుణాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: వరదల కారణంగా నష్టపోయిన 1,200 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల సంస్థలకు రాష్ట్రప్రభుత్వ వృత్తుల అభివృద్ధి సంస్థ రూ.33 కోట్ల రుణాలు అందజేసింది. గత ఏడాది డిసెంబరులో తుపాను కారణంగా చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూర్, తూత్తుకుడి, తిరునెల్వేలి జిల్లాల్లో 4 వేలకు పైగా వృత్తి సంస్థలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ సంస్థలకు రుణాలు అందజేయాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆ ప్రకారం, ఒక సంస్థకు 6 శాతం వడ్డీకి రూ.3 లక్షలు రుణాలు అందజేశారు. ఇప్పటివరకు 1,200 సంస్థలకు రూ.33 కోట్ల రుణాలు అందించినట్టు అధికారులు తెలిపారు.

వివరాలు నమోదు చేయండి

● కళాశాలలకు ఉత్తర్వులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: కేంద్రప్రభుత్వం అడిగే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కళాశాలలకు రాష్ట్ర సాంకేతిక విద్యా డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలో ఉన్నత విద్యాసంస్థలను అభివృద్ధి చేసేందుకు విద్యా నాణ్యత, మౌలిక వసతులను ప్రజలు తెలుసుకొనేలా జాతీయస్థాయిలో ఉన్నత విద్య సర్వే జరుగుతోంది. ఇందుకోసం గత విద్యా సంవత్సరం ఉన్నత విద్యాసంస్థల పనితీరుపై చేపట్టిన గణనకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్‌లలో చేపట్టిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సాంకేతిక విద్యా డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేసింది.

రెండు వారాల్లో స్మారక మందిరాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: దివంగత మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి స్మారక మందిరాల్ని రెండు వారాల్లో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రూ.36 కోట్లతో అన్నా సమాధి వెనుక వైపు కరుణానిధి స్మారక మందిరం నిర్మాణపనులు జరుగుతున్నాయి. రూ.10 కోట్లతో జరుగుతున్న అన్నా స్మారక మందిరం పునరుద్ధరణ, ప్రహరీ నిర్మాణపనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని ప్రజాపనుల శాఖ మంత్రి వేలు ఉత్తర్వులు జారీ చేశారు.

రేపటినుంచి శంకర విజయం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: ఆదిశంకరాచార్యులు ఉపదేశాలు అందరికి చేరేలా కోయంబత్తూర్‌లో ఈనెల 14 నుంచి 18వ తేది వరకు 'శంకర విజయం' ఉత్సవాలు నిర్వహించనున్నారు. శృంగేరి జగద్గురు శంకరాచార్యులు భారతి తీర్థ స్వామి సన్యాసం స్వీకరించి స్వర్ణోత్సవం పూర్తయిన సందర్భంగా వివిధ నగరాల్లో మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. శారద పీఠానికి చెందిన జగద్గురు విధుశేఖర భారతీస్వామి ఈ ఉత్సవాలను గత ఏడాది నవంబరు 8వ తేది శృంగేరిలో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, 14 నుంచి 18వ తేది వరకు కోయంబత్తూర్ రేస్ కోర్స్ శారదాంబాళ్ ఆలయ ప్రాంగణంలో ఉన్న శారదాలయంలో శంకర విజయం ఉత్సవాలను కోవై భారతీయ విద్యా భవన్ అధ్యక్షుడు కృష్ణరాజ్ వానవ రాయర్ ప్రారంభించనున్నారు.

22న జేఎస్ఓ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ (జేఎస్ఓ) పోస్టుల భర్తీకి ఈ నెల 22వ తేది ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి గోపాలసుందరరాజ్ తెలిపారు. కౌన్సిలింగ్ మార్చి 3వ తేది టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలోనే జరుగుతుందని ఆయన వివరించారు.

ఏడు ఆధునిక శ్మశానవాటికలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: షోళింగనల్లూర్ మండలంలో ఏడు ఆధునిక శ్మశానవాటికలు ఏర్పాటు కానున్నాయి. ఈసీఆర్, ఓఎంఆర్ ప్రాంతాలు కలిగిన షోళింగనల్లూర్ మండలంలో 9 వార్డులున్నాయి. ఒక్కో వార్డులో ఆధునిక శ్మశానవాటికల ఏర్పాటుకు కార్పొరేషన్ నిర్ణయించింది. 194వ వార్డు హరిశ్చంద్రా రోడ్డులో ఉన్న శ్మశానవాటికను రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు. 192, 197 వార్డుల్లో స్థలం లేకపోవడంతో శ్మశానవాటికలు ఏర్పాటు చేయలేదు. ఓఎంఆర్‌లో 200వ వార్డులో రూ.1.35 కోట్లతో నిర్మించిన శ్మశానవాటికను గత ఏడాది ప్రారంభించగా 196, 199 వార్డుల్లో రూ.2.70 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, 193, 195, 198 వార్డుల్లో శ్మశానవాటికల ఏర్పాటుకు రూ.4.05 కోట్లు కేటాయించారు. మూడ్రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు.

కోటి గృహాలకు తాగునీటి కనెక్షన్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కోటికి పైగా గృహాలకు జల్‌జీవన్ పథకం కింద తాగునీటి కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం తాగునీటి కనెక్షన్లు ఇచ్చేందుకు కేంద్రప్రభుత్వం జల్‌జీవన్ పథకం ప్రారంభించింది. ఇందులో జాతీయస్థాయిలో 73.98 శాతం ఇళ్లకు తాగునీటి కనెక్షనుఇవ్వగా, రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కోటిఇళ్లకు (80.43శాతం) కనెక్షను ఇచ్చారు.

12 మంది ఇంజనీర్ల నియామకం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: సీఎండీఏలో పదేళ్ల అనంతరం 12 మంది సహాయ ఇంజనీర్లకు నియామక ఉత్తర్వులు అందజేశారు. సీఎండీఏలో భవన నిర్మాణం ప్రత్యేకంగా పనిచేస్తోంది. ఈ విభాగంలో సహాయ ఇంజనీర్ల ఎంపిక నేరుగా జరుగుతుండేది. ఈ నేపథ్యంలో, పర్మినెంట్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యతలను ప్రభుత్వం టీఎన్‌పీఎస్సీకి అప్పగించింది. ఆ ప్రకారం, ఆ పోస్టుల భర్తీకి ఇటీవల రాతపరీక్ష నిర్వహించి అర్హత ఆధారంగా ఎంపికైన 12 మంది సహాయ ఇంజనీర్లను సీఎండీఏలో నియమించింది.

నేటినుంచి బేకరీ వస్తువుల తయారీపై శిక్షణ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 12: నగరంలో బేకరీ వస్తువుల తయారీపై శిక్షణ తరగతులను మంగళవారం నుంచి 16వ తేది వరకు రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ నిర్వహించనుంది. మూడు రోజులు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే తరగతుల్లో బేకరీ వస్తువుల మూల పదార్థాలు, బ్రాండ్‌లు, పరికరాలు, ఉపకరణాలపై వివరిస్తారు. హైదరాబాద్ కరాచీ బిస్కెట్, జర్రా సాల్ట్ బిస్కెట్, స్వీట్ కుకీస్, బాంబే బన్, స్వీట్ బ్రెడ్, క్రీం బన్, పఫ్స్ తదితరాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. రూ.5,000 రుసుము చెల్లించి ఈ శిక్షణలో చేరాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

ట్రేడ్ ఫెయిర్‌ను సందర్శించిన 3.75 లక్షల మంది

పెరంబూర్, ఫిబ్రవరి 12: స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ట్రేడ్ ఫెయిర్‌ను 28 రోజుల్లో 3.75 లక్షల మంది సందర్శించారు. ఈ మైదానంలో 48వ 'ఇండియా టూరిజం, ఇండస్ట్రీ ఫెయిర్' గత జనవరి 14వ తేది ప్రారంభమైంది. 70 రోజులు జరగనున్న ఈ ట్రేడ్ ఫెయిర్‌లో 51 స్టాళ్లు ఏర్పాటయ్యాయి. రాష్ట్రప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కల్పించడానికి స్టాళ్లు ఏర్పాటు చేశారు. అలాగే వివిధ రకాల దుకాణాలు, వినోద కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు, పాట కచ్చేరి, జానపద కళల ప్రదర్శన తదితరాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, 28వ రోజైన ఈనెల 10న శనివారం అత్యధికంగా 15,120 మంది సందర్శించారు. ఆ ప్రకారం, 28 రోజుల్లో మొత్తం 3,11,543 మంది పెద్దలు, 63,826 మంది చిన్నారులు సందర్శించినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రకటించింది.

వేసవిలో 20 శాతం అదనపు విక్రయాలు: ఆవిన్

పెరంబూర్, ఫిబ్రవరి 12: వేసవి సీజన్ సందర్భంగా ఆవిన్ పాల ఉత్పత్తులు 20 శాతం అదనపు విక్రయాలు చేపట్టాలని నిర్ణయించారు. ముఖ్యంగా, ఆవిన్ ఐస్‌క్రీం, మజ్జిగ తదితర విక్రయాలు పెంచనున్నారు. ఈ విషయమై ఆవిన్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా రూ.45 కోట్ల ఆవిన్ ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయన్నారు. వేసవిలో కొన్ని ఉత్పత్తుల విక్రయాలు పెంచాలని నిర్ణయించామన్నారు. అంబత్తూర్, సేలం, మదురై ప్రాంతాల్లో ఐస్‌క్రీం తయారీ కేంద్రాలున్నాయని, వీటిలో ఐస్‌క్రీం, కుల్ఫీ, మజ్జిగ తదితరాలు తయారు చేస్తున్నామన్నారు. వేసవిలో ఐస్‌క్రీం, మజ్జిగకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అందుకు తగినట్లుగా వాటి ఉత్పత్తి, భద్రపరిచేందుకు శీతలీకరణ పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రూ.కోటి హవాలా నగదు స్వాధీనం

పెరంబూర్, ఫిబ్రవరి 12: స్థానిక నొలంబూర్‌లోని ఓ ఇంట్లో దాచిన రూ.కోటి హవాలా నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అమింజికరై, పరిసర ప్రాంతా ల్లో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో హవాలా నగదు తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో, ఇన్‌స్పెక్టర్ కృపానిధి నేతృత్వంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఇంతలో మళ్లీ ఫోన్ చేసిన వ్యక్తే... ఇప్పుడే ఆ వాహనం తనిఖీల్ని దాటి వెళ్లిందని, ఆ ప్రాంతంలోని ఓ ఇంటి ముందు ఉందని తెలిపి ఫోన్ కట్ చేశాడు. ఫోన్‌లో తెలిపిన చిరునామా ఆధారంగా పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లగా, వారిని చూసిన ఓ యువకుడు తప్పించుకొనేందుకు యత్నించగా, అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, అబ్దుల్ హమీద్ అని, హవాలా నగదు, నగలు మారుస్తుంటాడని, ఆ క్రమంలో, హవాలా నగదును నొలంబూర్‌లోని తన చిన్నాన్న ఇంటికి తీసుకొచ్చాడని తేలింది. ఇంట్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు, నగదు స్వాధీనం చేసుకొని హమీద్ అరెస్ట్ చేశారు.

గంజాయి స్వాధీనం: ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 12: హోసూరు నుంచి చెన్నైకి మినీ వ్యాన్‌లో తరలిస్తున్న 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. తాంబరం పోలీస్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ విభాగం ప్రత్యేక విభాగం పోలీసులు హోసూరుకు వెళ్లి, అక్కడి పోలీసుల సాయంతో కర్ణాటక నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మినీ వ్యాన్‌ను తనిఖీ చేయగా, అందులో 100 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఒడిశాకు చెందిన జిపన్ విశ్వాస్, బలరాజ్ పూజారి, కర్ణాటకకు చెందిన శశికుమార్‌ను అరెస్ట్ చేశారు. అలాగే అదే మార్గంలో వచ్చిన రెండు కార్లను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం గంజాయి, వాహనాలు, ముగ్గురిని నగరానికి తీసుకొచ్చిన పోలీసులు, వారిని విచారిస్తున్నారు.

డ్రోన్లతో దోమల నివారణకు చర్యలు

అడయార్, ఫిబ్రవరి 12: నగరంలో నానాటికి పెరిగిపోతున్న దోమల బెడద నుంచి రక్షించేందుకు చెన్నై నగర పాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలో 248 కిలోమీటర్ల మేరకు ఉన్న నీటి వనరుల మార్గంలో దోమల నివారణ కోసం డ్రోన్లను వినియోగించనుంది. దోమల ఉత్పత్తికాకుండా వీటిని నిర్మూలించేలా డ్రోన్ల ద్వారా రసాయనాలను పిచికారి చేయాలని భావిస్తోంది. ఈ విషయంపై కార్పొరేషన్ అధికారి ఒకరు మాట్లాడుతూ... వర్షాలు, మిచౌంగ్ తుఫాను కారణంగా దోమల నివారణ పనులను నిలిపివేశామన్నారు. ఇపుడు వేసవిటప్రారంభకానుందని, ఇప్పటికే ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోందన్నారు. దీనికితోడు దోమల ఉత్పత్తి అధికమైందన్నారు. అందుకే ఈ దోమల ఉత్పత్తిని నివారించేందుకు డ్రోన్లను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.

ఓపీఎస్‌తో భేటీకి ఆసక్తి చూపని జేపీ నడ్డా!



అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్న మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే బహిష్కృత నేత ఓ.పన్నీర్‌సెల్వం బృందం

అడయార్, ఫిబ్రవరి 12: మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే బహిష్కృత నేత ఓ.పన్నీర్‌సెల్వంతో సమావేశానికి భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆసక్తి చూపలేదు. ఇది రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా బీజేపీ అగ్రనాయకులు ఎవరు వచ్చినా వారితో ఓపీఎస్ సమావేశమవుతున్నారు. అదేవిధంగా ఆదివారం చెన్నైకి వచ్చిన జేపీ నడ్డా - ఓపీఎస్‌ల మధ్య సమావేశం జరుగుతుందని ప్రచారం జరిగింది. ఇందులో ఇతర కార్యక్రమాలను కూడా ఓపీఎస్ రద్దు చేసుకుని అత్యవసరంగా చెన్నైకి వచ్చారు. కానీ, జేపీ నడ్డా మాత్రం తన పార్టీ నేతలతో సమావేశమై ఢిల్లీకి వెళ్ళిపోయారు. దీంతో ఓపీఎస్ ఒకింత నిరాశకు లోనయ్యారు. ఓపీఎస్‌ను నడ్డా పక్కనపెట్టడానికి కారణం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ కూటమిలో చేరేందుకు పీఎంకే, డీఎండీకేలు చర్చలు జరుపుతున్నాయి. ఇవి ఇంకా ఓ కొలిక్కి రాలేదు. పైగా సీట్ల సర్దుబాటు చర్చలు ఇంకా ప్రారంభమే కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఓపీఎస్‌తో సమావేశమైతే ఇతర పార్టీలతో చర్చలకు ఆటంకంగా ఉంటుందని భావించిన నడ్డా.. ఓపీఎస్‌ను సమావేశానికి ఆహ్వానించకుండానే హస్తినకు వెళ్ళిపోయారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

విల్లుపురంలో మినీ టైడల్ పార్కు

● ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

పెరంబూర్, ఫిబ్రవరి 12: విల్లుపురంలో నిర్మించిన మినీ టైడల్ పార్కును సీఎం స్టాలిన్ త్వరలో ప్రారంభించనున్నారు. తరమణిలో రాష్ట్రప్రభుత్వానికి సొంతమైన టైడల్ పార్కులో పలు ఐటీ సంస్థలు పనిచేస్తుండగా, వేలాది మంది పనిచేస్తున్నారు. అలాగే, టైడల్ పార్కు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ఐటీ సంస్థలు ఏర్పాటయ్యాయి. ఈ సంస్థల్లో పనిచేసేందుకు పలు జిల్లాల నుంచి యువత నగరానికి వస్తోంది. ఈక్రమంలో యువతకు వారి సమీప ప్రాంతాల్లోని ప్రధాన నగరాల్లో మినీ టైడర్ పార్కులు ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా విల్లుపురం జిల్లా వానూర్ తాలూకా తిరుచిత్రంబలంలో 63,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.31 కోట్లతో నాలుగు అంతస్తులతో మినీ టైడల్ పార్కు నిర్మాణపనులు ఇటీవల ముగియగా, వచ్చే వారం సీఎం ప్రారంభించనున్నారు. అలాగే, వేలూరు ప్రభుత్వ సిప్కాట్‌లో 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తులతో ఏర్పాటుకానున్న మినీ టైడల్ పార్కు నిర్మాణపనులు జూన్ నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

విరుదునగర్ జిల్లాలో బాణసంచా ప్రమాదాల్లో 131 మంది మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 12: విరుదునగర్ జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు 69 బాణసంచా కర్మాగారాల్లో ప్రమాదాలు జరిగి 131 మంది మృతిచెందగా, 146 మంది గాయపడ్డారని విరుదునగర్ జిల్లా ఎస్పీ అఫిడవిట్‌లో తెలిపారు. బాణసంచా ప్రమాదంలో భర్తను కోల్పోయిన తనకు పరిహారం అందించాలని కోరుతూ బాధిత మహిళ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి, విరుదునగర్ జిల్లాలో ఐదేళ్లలో జరిగిన బాణసంచా ప్రమాదాలు, జిల్లా యంత్రాంగం అనుమతించిన కర్మాగారాలు ఎన్ని? అనే వివరాలతో కూడిన నివేదికలు దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు సోమవారం విచారణకు రాగా, జిల్లాలో 1,087 బాణసంచా తయారీ కర్మాగారాలు, 2,963 విక్రయ దుకాణాలున్నట్లు జిల్లా కలెక్టర్ తరపున అఫిడవిట్ దాఖలు చేశారు. అలాగే, కర్మాగారాల్లో తగిన భద్రతా నిబంధనలు పాటించడం లేదని, రసాయన మిశ్రమాలు కూడా మోతాదుకు మించి కలుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ తరపున దాఖలైన అఫిడవిట్‌లో తెలిపారు.

ఇద్దరు కుమార్తెలతో బ్యాంక్ మహిళా అధికారి ఆత్మహత్య

పెరంబూర్, ఫిబ్రవరి 12: తంజావూరు జిల్లాలో ఇద్దరు కుమార్తెలను కట్టి రైలు కింద తోసిన ప్రైవేటు బ్యాంక్ మహిళా అధికారి, తాను ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి భర్త, బంధువులను పోలీసులు విచారిస్తున్నారు. కుంభకోణం సమీపం నాల్‌రోడ్ పొన్నుస్వామినగర్‌కు చెందిన రాజేష్ భార్య ఆర్తీ(40) కుంభకోణంలోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్. ఈ దంపతులకు ఆరుద్ర (11), సుభద్ర (8) అనే కుమార్తెలున్నారు. ఆరుద్ర 6వ తరగతి, సుభద్ర 4వ తరగతి చదువుతున్నారు. రాజేష్ కోయంబత్తూర్‌లో భవన నిర్మాణ సంస్థను నడుపుతూ, అప్పుడప్పుడూ వచ్చి భార్య, కుమార్తెలను చూసి వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం స్నేహితురాలి సీమంతానికి వెళ్తున్నట్లు కుటుంబసభ్యులకు చెప్పిన ఆర్తీ, ఇద్దరు కుమార్తెలతో కలసి ద్విచక్రవాహనంలో పాపనాశం సమీపం ఉద్దాని గ్రామానికి వెళ్లింది. కార్యక్రమం ముగిసి వేకువజామున 3.30 గంటల ప్రాంతంలో ఇంటికి బయల్దేరిన ఆర్తీ ఉద్దాని సమీపంలోని ద్విచక్రవాహనం ఆపి ఇద్దరు కుమార్తెలతో సమీపంలోని రైలుపట్టాల వద్దకు వెళ్లింది. ఆ సమయంలో సెంగోట్టై నుంచి మైలాడుదురైకి వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రావడంతో, ఇద్దరు కుమార్తెలను కట్టివేసి రైలు కింద తోసి, ఆమె కూడా రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న కుంభకోణం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొని సోమవారం ఆసుపత్రికి వచ్చిన రాజేష్, అతని బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

తల్లీ, కూతురు...

తంజావూరు జిల్లా తిరువిడైమరుదూర్ పిచ్చైకట్టలై ప్రాంతానికి చెందిన రేవతి (50), ఆమె కుమార్తె మహేశ్వరి (30)తో కలసి జీవిస్తోంది. మహేశ్వరికి ఇంకా వివాహం కాలేదు. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం ఇద్దరు తిరువిడైమరుదూర్ రైల్వేస్టేషన్‌కి వెళ్లి మైలాడుదురై నుంచి మైసూరు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలో రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు.


సోనియా అగర్వాల్

మాజీ భర్తతో కలిసి పనిచేయడంలో ఏ సమస్యా లేదు

● సోనియా అగర్వాల్

తన మాజీ భర్త, దర్శకుడు సెల్వరాఘవన్‌తో కలిసి పని చేయడానికి తనకు ఎలాంటి సమస్యా లేదని హీరోయిన్ సోనియా అగర్వాల్ స్పష్టం చేశారు. 2006లో ధనుష్ హీరోగా, సోనియా అగర్వాల్, స్నేహ హీరోయిన్లుగా వచ్చిన చిత్రం 'పుదుపేట'. సూపర్ హిట్ చిత్రంగా నిలిచింది. ఇపుడు ఈ మూవీ రెండో భాగాన్ని తెరకెక్కించాలని ధనుష్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా కోరుకుంటున్నారు. అదే సమయంలో ఇటీవల తన సోషల్ మీడియా ఖాతాలో 'పుదుపేట-2' ఈ సంవత్సరమే ప్రారంభమవుతుందని దర్శకుడు సెల్వరాఘవన్ ప్రకటించారు. దీంతో కొక్కి కుమార్ మళ్లీ వస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సీక్వెల్‌లో నటించేందుకు సోనియా అగర్వాల్ సమ్మతం తెలిపారు. ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.... 'పుదుపేట' చిత్రంలో నటించాలని నాకు వర్తమానం వస్తే కచ్చితంగా నటించేందుకు సమ్మతిస్తా. నటన నా వృత్తి. సెల్వతో కలిసి పని చేయడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ, ఇప్పటివరకు ఈ చిత్రంలో నటించాలని కోరుతూ నాకు ఎలాంటి పిలుపు రాలేదు. ఇందులో ఎవరెవరూ నటించనున్నారో కూడా నాకు తెలియదు' అని వివరించారు.

'వైట్‌రోజ్' ఫస్ట్‌లుక్ విడుదల

'కయల్' ఆనంది ప్రధాన పాత్రను పోషించిన 'వైట్‌రోజ్' సినిమా ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ హీరో విజయ్ సేతుపతి విడుదల చేశారు. పూంపారై మురుగన్ ప్రొడక్షన్స్ నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ రాజశేఖర్ దర్శకత్వంలో ఈ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఇందులో ఆర్‌కే సురేష్ విభిన్నమైన గెటప్‌తో ప్రతినాయకుడిగా నటించారు. వీరితో పాటు విజిత్, రూసో శ్రీధరన్, శశిలయ, గణేష్, రామనాథన్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విజయ్ సేతుపతి రిలీజ్ చేసి, చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ సినిమాలో పోలీస్ కంట్రోల్ రూం కీలకంగా ఉంది. ఇందు కోసం భారీ ఖర్చుతో సెట్‌ను నిర్మించి, అందులో సినిమా షూటింగ్ పూర్తి చేశారు. వైరముత్తు సాహిత్యానికి సుదర్శన్ సంగీత బాణీలు సమకూర్చారు. ఇళయరాజా ఛాయాగ్రహణం అందించారు. త్వరలోనే ఆడియో, ట్రైలర్, రిలీజ్ తేదీలను వెల్లడించనున్నట్టు దర్శకుడు రాజశేఖర్ తెలిపారు.


ఫస్ట్‌లుక్ రిలీజ్ చేస్తున్న విజయ్ సేతుపతి

చిత్రజ్యోతి

'ఈ మెయిల్'లో రాగిణి ఇస్తున్న సందేశం ఏంటి?

ఎస్ఆర్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానరుపై ఎస్.ఆర్.రాజన్ దర్శకత్వంలో కన్నడ నటి రాగిణి ద్వివేది ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఈ మెయిల్'. అశోక్ కథానాయకుడు. తమిళం, కన్నడ భాషల్లో నిర్మించారు. రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేసే రాగిణి ద్వివేది.. డబ్బుపరంగా, మానసికంగా బాధపడుతుంటారు. దీంతో ఆమె 'టై గేమ్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో ఆన్‌లైన్ గేమ్ ఆడుతుంటారు. ఈ గేమ్‌లో ఆమె డబ్బును బాగా సంపాదిస్తారు. ఒకానొక దశలో ఈ యాప్ నిర్వాహకుల నుంచి ఆమెకు బెదిరింపులు ప్రారంభమవుతాయి. స్విస్ బ్యాంకులో ఖాతాలు కలిగిన అనేక మంది ప్రముఖుల వివరాలు ఒక హార్డ్ డిస్క్‌లో విలన్ ముఠా వద్ద ఉందని వాటిని చేజిక్కించుకుని, తమకు అప్పగించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను బెదిరిస్తారు. ఆ హార్డ్ డిస్క్‌ను హీరోయిన్ ఎలా స్వాధీనం చేసుకున్నారు? ఆ యాప్ వెనుక ఉన్న వారు ఎవరు? అనే విషయాలను ఉత్కంఠకు గురి చేసేలా, యాక్షన్ అంశాలతో చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్.ఆర్.రాజన్ మాట్లాడుతూ... చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉందిక దాని... అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేయొద్దని, మొబైల్ గేమ్‌లు ఆడేవారు వాటికి బానిసకారాదని నేటి యువతకు ఒక మంచి సందేశాన్ని ఇచ్చే చిత్రంగా రూపొందించాం. గ్లామర్, యాక్షన్ సన్నివేశాల్లో రాగిణి ద్వివేది నటించి శెభాష్ అనిపించుకున్నారు. రియల్ ఎస్టేట్ యజమానిగా మనోబాలా అద్భుతంగా నటించారు' అని వివరించారు.


'ఈ మెయిల్'లో రాగిణి ద్వివేది - అశోక్



'డాన్' కాంబినేషన్‌లో కొత్త చిత్రం

హీరో శివకార్తికేయన్ - దర్శకుడు సిబి చక్రవర్తి కాంబినేషన్‌లో మరో చిత్రం తెరకెక్కనుంది. 2022లో వీరిద్దరి కాంబినేషన్‌లో 'డాన్' చిత్రం రాగా సూపర్ డూపర్ హిట్ సాధించింది. ఈ సినిమా తర్వాత సిబి చక్రవర్తితో సినిమాలు తెరకెక్కించేందుకు ఇటు కోలీవుడ్ అటు టాలీవుడ్ నిర్మాతలు ఆసక్తి చూపుతూ, చర్చలు కూడా జరిపారు. అయితే, సిబి చక్రవర్తి దర్శకత్వంలో తెరకెక్కించే నిర్మాత ఎవరన్నదానిపై ఇప్పటివరకు స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో శివకార్తికేయన్ - సిబి కాంబినేషన్‌లో మరో చిత్రం తెరకెక్కనుందని కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ ప్యాషన్ స్టూడియోస్ ఈ సినిమాను రూపొందించనుంది. అయితే, ఈ సినిమా వచ్చే యేడాది సెట్స్‌పైకి వెళుతుందని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉంది.

తీరానికి కొట్టుకొచ్చిన సిగ్నల్ పరికరం


పరికరాన్ని పరిశీలిస్తున్న తీరప్రాంత భద్రతా దళం పోలీసులు

వేళచ్చేరి, ఫిబ్రవరి 12: మైలాడుగురై జిల్లా శీర్గాళి సమీపం నాయకర్‌కుప్పం తీర ప్రాంతంలో సోమవారం ఉదయం సిగ్నల్ పరికరం తీరానికి కొట్టుకొచ్చింది. గమనించిన జాలర్లు వెంటనే తీరప్రాంత భద్రతా దళం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆ వస్తువును పరిశీలించారు. ఒకటిన్నర అడుగున్న ఈ పరికరంలో ఆంగ్లంలో 'డేంజర్' అనే అక్షరాలున్నాయి. అలాగే, 'గ్రీన్ స్టార్' గుర్తు కూడా ఉంది. ఇది ఓడల్లో వినియోగించే పరికరమా? పేలుడు పదార్థమా? అని విచారిస్తున్న పోలీసులు, ఈ పరికరాన్ని చెన్నైలోని కేంద్ర కార్యాలయానికి పంపాలని నిర్ణయించారు. పరిశోధనల అనంతరం ఆ పరికరం ఏమిటో తెలుస్తుందని పోలీసు అధికారులు తెలిపారు.

రేపు ప్రేమికుల దినోత్సవం
కోయంబేడులో రోజా పూలకు డిమాండ్

పెరంబూర్, ఫిబ్రవరి 12: ప్రేమికుల రోజు దగ్గర పడుతుండడంతో స్థానిక కోయంబేడు మార్కెట్లో రోజా పూలకు డిమాండ్ పెరిగింది. ఒక కట్ట రోజా పూలు రూ.300 ధర పలుకుతున్నాయి. ఈ నెల 14న ప్రేమికుల దినోత్సవం. ఈ సందర్భంగా అమ్మాయిలకు రోజా పూలు అందజేసి తమ ప్రేమను వ్యక్త పరుస్తుంటారు. అందువల్ల ఈ రోజున రోజా పూలకు భలే గిరాకీ ఉంటుంది. ఈ నేపథ్యంలో, బుధవారం ప్రేమికుల రోజు కావడంతో కోయంబేడు మార్కెట్‌కు హోసూరు, బెంగళూరు, కృష్ణగిరి, దేవదానపల్లి, ఊటీ తదితర ప్రాంతాల నుంచి భారీగా రోజా పూలు దిగుమతి అయ్యాయి. కట్ట రూ.250 నుంచి రూ.300 వరకు విక్రయమవుతున్నాయని, 14న ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు తెలిపారు.

వికలాంగుల సంక్షేమానికి విశేష పథకాలు

జీసీసీ కమిషనర్ రాధాకృష్ణన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వికలాంగులను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని నగర కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఎంఎస్ దాదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికలాంగుల కోసం ఇటీవల వివిధ రకాల పోటీలు జరిగాయి. మీనంబాక్కంలో ఉన్న ఏఎం జైన్ కాలేజీ మైదానంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, సంస్థ ట్రస్టీ మహేంద్ర దాదా, సీనియర్ క్రికెటర్ కే.ఎం.శ్రీకాంత్, మోహన్ గోయెంకా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోహన్ గోయెంకా తదితరులు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ ట్రస్టీ మీనా దాదా మాట్లాడుతూ.. శారీరక సవాళ్లు ఉన్న వ్యక్తులకు వారి సామర్థ్యాలను ప్రదర్శించేందుకు అవసరమైన వేదికను అందించడమే కాకుండా, వారికి అండగా నిలబడే ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం తమకెంతో సంతోషంగా ఉందని వివరించారు.

అన్నానగర్‌లో 'చల్లాని జ్యువెలరీ' షోరూం



చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్‌లో 'లిల్లే బై చల్లాని' పేరుతో చల్లాని జువెలరీ షోరూం ఏర్పాటైంది. దీన్ని ప్రముఖ సినీ నటి ఆండ్రియా సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... 16-24, 25-34 ఏళ్ల మధ్య వయసులో మార్పు కోసం తహతహలాడే ఆధునిక మహిళల్ని మంత్రముగ్ధలను చేసే బంగారు, వజ్రాభరణాల ప్రత్యేక స్టోర్‌ను ఆవిష్కరించినట్లు చెప్పారు. తేలికపాటి చెవిపోగులు, లాకెట్స్, నెక్లెస్, గాజులతో కూడిన ప్రత్యేకమైన ఆభరణాలు, కలర్‌స్టోన్ కలెక్షన్లు, కిడ్స్ కలెక్షన్లు ప్రత్యేకంగా తయారు చేయించామన్నారు. పురుషుల కోసం బ్రాస్‌లెట్‌లు, చైన్లు, ఉంగరాలు మరెన్నో ఆభరణాలను సిద్ధం చేశామన్నారు. టర్కిష్, ఆమెథిస్ట్, నీలమణి, రూబీ, ఎమరాల్డ్ వంటి రంగురాళ్లతో డైమండ్ రింగులు, చెవిపోగులు, పెండెంట్లు, నెక్లెస్‌లు, కంకణాలు, గాజులు, ఆభరణాల యొక్క విస్తృత శ్రేణిని అందిస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా ఈ షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఒక్క రోజు వజ్రాల క్యారెట్‌కు రూ.5 వేలతో పాటు, వెండి సర్‌ప్రైజ్ బహుమతిని కూడా అందించారు.

ధనుష్కోటిలో పర్యాటకుల రద్దీ


ధనుష్కోటి తీరంలో పర్యాటకులు

పెరంబూర్, ఫిబ్రవరి 12: రామనాథపురం జిల్లా ధనుష్కోటి అరిచ్చల్‌మునై ప్రాంతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో నిర్మించిన రామాలయం ప్రాణ ప్రతిష్ఠ గత నెల 22వ తేది జరిగింది. ఆ సందర్భంగా 11 రోజులు వ్రతమాచరించిన ప్రధాని నరేంద్రమోదీ, దేశవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గత నెల 20వ తేది రాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ధనుష్కోటిని సందర్శించారు. అరిచ్చల్‌మునై నుంచి టెలిస్కోప్ ద్వారా భారత్-శ్రీలంక సముద్ర ప్రాంతంలో రాముడి వంతెన ఉన్నట్లు భావిస్తున్న ప్రాంతాన్ని వీక్షించారు. అనంతరం అరిచ్చల్‌మునై తీరంలో పూలు చల్లి పూజలు చేసిన ప్రధాని, ఆ ప్రాంతంలో కొద్దిసేపు కుర్చీలో సేదతీరారు. దీంతో, ప్రస్తుతం ధనుష్కోటి, అరిచ్చల్‌మునై పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. ఈ నేపథ్యంలో, వారం రోజులుగా ధనుష్కోటి, అరిచ్చల్‌మునైకు పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. పర్యాటకుల రాకతో విక్రయాలు పెరగడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎంఎంకే కూటమిదే విజయం

● టీటీవీ దినకరన్

వేళచ్చేరి, ఫిబ్రవరి 12: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం కూటమి మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ ధీమా వ్యక్తం చేశారు. డీఎంకే నిరంకుశ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏఎంఎంకే ఆధ్వర్యంలో ఆదివారం డెల్టా జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. తంజావూరులో జరిగిన బహిరంగ సభలో దినకరన్ మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చిందన్నారు. అలాంటి తనను కుట్రపూరితంగా ఎడప్పాడి పళనిస్వామి పార్టీ నుంచి తొలగించినా, లక్షలాది మంది కార్యకర్తలు తనను ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శిని చేశారన్నారు. పళనిస్వామి నేతృత్వంలో అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఘోరపరాజయం పాలైందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లోనూ ఆ పార్టీకి పరాజయం తప్పదన్నారు. ఇటీవల పార్లమెంటు ఎన్నికలపై వెలువరించిన సర్వే ఫలితాలను తారుమారు చేస్తూ, అధికార డీఎంకేకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని దినకరన్ తెలిపారు.

ఒక్క సీటు కోసం చేయి చాచే పార్టీ కాదు

● టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్


జీకే వాసన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శి జీఆర్ వెంకటేష్

వేళచ్చేరి, ఫిబ్రవరి 12: ఒక్క సీటు కోసం చేయి చాచే పార్టీ తమది కాదని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ స్పష్టం చేశారు. ఎగ్మూర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం టీఎంసీ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీకే వాసన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంటు సభ్యులు పార్టీలో లేకపోయినా కార్యకర్తల అండతో తాను రాజ్యసభ సభ్యుడిగా ఉన్నానన్నారు. పార్టీ బలోపేతానికి నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాల్సి ఉందన్నారు. దేశంలోనే కల్మషం లేని పార్టీగా టీఎంసీ ఉందన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ, అన్నాడీఎంకే కూటమిలో ఉన్నామని, ప్రస్తుతం ఆ రెండు పార్టీల మధ్య విభేధాలు ఉన్నాయన్నారు. ఆ రెండు పార్టీల నేతలతో తనకు సత్సంబంధాలున్నాయన్నారు. మరో రెండు నెలల్లో పార్లమెంటు, రెండేళ్లలో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకుంటాయని జీకే వాసన్ తెలిపారు.

డీఎంకే కూటమిలో నాలుగు స్థానాలు కోరాం

● డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్



వేళచ్చేరి, ఫిబ్రవరి 12: డీఎంకే కూటమిలో మూడు రిజర్వుడు, ఒక జనరల్ నియోజకవర్గాలు కేటాయించాలని కోరినట్లు డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసే స్థానాలపై డీఎంకే ఏర్పాటు చేసిన సీట్ల సర్దుబాటు కమిటీ కూటమి పార్టీలతో చర్చలు జరుపుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, మనిదనేయ మక్కల్ కట్చి సహా పలు పార్టీలతో తొలివిడత చర్చలు ముగిసిన నేపథ్యంలో, సోమవారం డీపీఐ నేతలతో సమావేశం నిర్వహించారు. స్థానిక తేనాంపేటలోని అన్నా అరివాలయంలో జరిగిన చర్చల అనంతరం తిరుమావళవన్ విలేకరులతో మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికల్లో చిదంబరం, విల్లుపురం, తిరువళ్లూర్ తదితర మూడు రిజర్వుడు, కళ్లకుచ్చి, పెరంబలూర్ జనరల్ సీట్లలో ఒక దాన్ని కేటాయించాలని తమ పార్టీ తరఫున కోరామన్నారు. తదుపరి చర్చల్లో సీట్ల సర్దుబాటుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం డీఎంకే కూటమి 'ఇండియా' కూటమిలా బలంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలోని 40 స్థానాలను కూటమి కైవసం చేసుకుంటుందని తిరుమా తెలిపారు. కాగా, గత 2019 పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమిలో డీపీఐ పార్టీకి చిదంబరం (రిజర్వుడు), విల్లుపురం (రిజర్వుడు) అని రెండు స్థానాలు కేటాయించగా, చిదంబరం నియోజకవర్గంలో పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్, విల్లుపురం నియోజకవర్గంలో డీపీఐ ప్రధాన కార్యదర్శి రవికుమార్ విజయం సాధించిన విషయం తెలిసిందే.

చర్చల తర్వాతే ఎన్నికల చిహ్నంపై నిర్ణయం

అడయార్: లోక్‌సభ ఎన్నికల కోసం డీఎంకేతో చర్చలు జరిపిన తర్వాతే తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసే ఎన్నికల చిహ్నంపై నిర్ణయం తీసుకుంటామని డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, డీఎంకే కూటమిలో పదికిపైగా పార్టీలు ఉన్నాయన్నారు. సీట్ల పంపిణీ విషయంలో ఆయా పార్టీల కోరికల మేరకు డీఎంకే నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే, ఇక్కడ ఒక పార్టీ బలం కంటే కూటమి బలాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, అపుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. తమ పార్టీకి ఇప్పటివరకు ఎన్నికల గుర్తు లేదన్నారు.పైగా గుర్తును కేటాయించుకుని, దాన్ని చివరి వరకు కాపాడుకోవడం కష్టతరమన్నారు. అందుకే డీఎంకే గుర్తు ఉదయించే సూర్యుడి గుర్తుపై పోటీ చేస్తామని తాము కోరుతున్నామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కోసం డీఎంకేతో చర్చలు ముగిసిన తర్వాతే పోటీ చేసే ఎన్నికల గుర్తుపై ఒక నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు.


చెన్నై కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఫ్లాగ్ డే సందర్భంగా పార్టీ జెండా ఎగురవేస్తున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, సుధీష్ తదితరులు

జీవితంలో శాంతి... శక్తినిస్తుంది

● గవర్నర్ తమిళిసై



పుదుచ్చేరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవితంలో శాంతి ఓ విధమైన శక్తిని ఇస్తుందని పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. మహాన్ అరవింద 150వ జయంతి వేడుకలను పురస్కరించుకుని పుదుచ్చేరిలోని ఆరోవిల్‌లో రెండో అంతర్జాతీయ ఆధ్యాత్మిక సదస్సు జరిగింది. ఇందులో గవర్నర్ తమిళిసై పాల్గొని ప్రసంగిస్తూ... జీవితంలో శాంతి కొన్ని సమయాల్లో బలమైన శక్తిని ఇస్తుందన్నారు. అన్నై, అరవింద దాన్ని గుర్తించి ఒక ప్రాంతాన్ని ఆవిష్కరించారని, తద్వారా శాంతిని, శక్తిని పొందుతున్నామన్నారు. సముద్రంలోని అలలకు నిరంతరం ఆటుపోట్లు ఉంటాయన్నారు. వాటికి విశ్రాంతి లేదన్నారు. అదేవిధంగా జీవితంలో కొన్ని సమస్యలు ఎదురవుతూనే ఉంటాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని, క్షణికావేశానికిలోనై ఆత్మహత్యలు చేసుకోరాదన్నారు. ఇలాంటి వారంతా సమస్యలు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. పూర్వీకులు సంతోకరమైన జీవితాన్ని ఎలా గడపాలో నేర్పించారన్నారు. ప్రతి రోజూ ఉదయాన్నే ధ్యానం చేయడం వల్ల ఎంతో మనఃశాంతిని పొందవచ్చన్నారు. తద్వారా ఎలాంటి సమస్యలనైనా దీటుగా ఎదుర్కోవచ్చన్నారు. మహాభారతం, అన్నై, అరవింద వంటి కథలను వింటే దృఢమైన ఆత్మవిశ్వాసం కలుగుతుందన్నారు. అదేసమయంలో స్వీయనియంత్రణ ఎంతో అవసరమని, తద్వారా స్థాయిని కూడా పెంచుకోవచ్చన్నారు. ధ్యానం, యోగా వంటివి ఎంతో బలాన్ని ఇస్తాయని తమిళిసై అన్నారు.

బూత్ కమిటీల బలోపేతం : బీజేపీ

అడయార్, ఫిబ్రవరి 12: త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో బూత్ కమిటీలను బలోపేతం చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ నిర్ణయించింది. వచ్చే ఎన్నికల్లో గతం కంటే అధిక శాతంలో ఓట్లను పొందాలన్న లక్ష్యంతో ఆ పార్టీ ముందుకు సాగుతోంది. ముఖ్యంగా 20 శాతం కంటే ఎక్కువ మొత్తంలో ఓట్లు పొందాలని భావిస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాల్లో నాయకులను ఎంపిక చేసింది. దీనికి సంబంధించి ఒక సమాలోచన భేటీ ఆదివారం చెన్నైలోని కొంట్టూన్‌కుళత్తూరులో నిర్వహించారు. బీజేపీ క్షేత్రస్థాయి బలాన్ని మరింతగా బలోపేతం చేయాలని ఇందులో పాల్గొన్న నేతలంగా అభిప్రాయపడ్డారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 65 వేల బూత్ కమిటీలకు ప్రత్యేక నిర్వాహకులను నియమించింది ప్రతి బూత్‌కు ఇద్దరు చొప్పున నియమించింది. వీరంతా ఆయా బూత్ పరిధిలో ఉన్న ప్రజలతో మమేకమై పార్టీకి అండగా నిలబడాలని దిశానిర్దేశం చేసింది.

వేలంతో రూ.30 లక్షల మోసం

● ట్రాఫిక్ కానిస్టేబుల్ దంపతుల అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 12: స్థానిక సెంట్ థామస్ మౌంట్‌లో వేలం పేరుతో రూ.30 లక్షల మేరకు మోసం చేసిన ట్రాఫిక్ కానిస్టేబుల్, ఆయన భార్యను నగర పోలీసులు అరెస్టు చేశారు. సెంట్ థామస్ పోలీస్ క్వార్టర్స్‌కు చెందిన అరుణ్‌ప్రసాద్ మణలిలో ట్రాఫిక్ పోలీస్‌గా పనిచేస్తున్నారు. ఈయన భార్య సోమలత. వీరిద్దరూ కలిసి తమ ప్రాంతంలో వేలం పాటలను నిర్వహిస్తూ వచ్చారు. వీరికి ఆ ప్రాంతానికి చెందిన అనేక మంది డబ్బులు చెల్లించారు. ఇలా రూ.30 లక్షల మేరకు వసూలు చేసిన అరుణ్ ప్రసాద్ మదుపరులకు డబ్బు చెల్లించలేదు. దీంతో బాధితులు సెంట్ థామస్ మౌంట్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి అరుణ్ ప్రసాద్ దంపతులను అరెస్టు చేశారు. కేసు విచారణ జరుపుతున్నారు.

ప్లస్ టూ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన ప్లస్ టూ ప్రాక్టికల్ పరీక్షలకు 6 లక్షలమంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర పాఠ్యప్రణాళికలో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ తరగతుల పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేది ప్రారంభమై ఏప్రిల్ 8వ తేది వరకు జరగనున్నాయి. ఆ ప్రకారం మార్చి 1 నుంచి 22వ తేది వరకు ప్లస్ టూ పరీక్షలు, మార్చి 4 నుంచి 25వ తేది వరకు ప్లస్‌వన్ పరీక్షలు, మార్చి 26 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు టెన్త్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో, ప్లస్‌టూ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమై ఈ నెల 17వ తేది వరకు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 5,000 పాఠశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో ప్రాక్టికల్స్ ఏర్పాటు చేశారు.


ప్రాక్టికల్ పరీక్షకు హాజరైన విద్యార్థినులు